చేనేతకు ఆర్థిక భరోసా

- ఏడాదికి రూ.24 వేలు, 50 ఏళ్లకే పెన్షన్
- రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ
- నేత కార్మికులతో ఆత్మీయ సమావేశం
- ఏపీ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందనతో కలిసి లబ్ధి పంపిణీ



లబ్ధిదారులకు చెక్కును అందిస్తున్న మంత్రి వేణు. చిత్రంలో చందన నాగేశ్వర్ తదితరులు

కడియం: రాష్ట్రవ్యాప్తంగా చేనేత కార్మికుల ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా, మగ్గం కలిగిన ప్రతి కుటుంబానికీ జగనన్న ప్రభుత్వం ఏడాదికి రూ.24 వేలను, 50 ఏళ్లకే పెన్షన్‌ను అందించి ఆర్థిక భరోసా కల్పించిందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి, రాజమండ్రి రూరల్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. ఆదివారం మురమండ పంచాయతీలోని చెరుకూరి సత్యం రుక్మిణీ కల్యాణ మండపం ఆవరణలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన చేనేత కార్మికులతో ఆత్మీయ సమావేశం జరిగింది. రాష్ట్ర గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వరరావుతో కలిసి మంత్రి వేణు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మంత్రి వేణు మాట్లాడుతూ చేనేత కార్మికుల కుటుంబాలకు భరోసాగా రాష్ట్ర ప్రభుత్వం మురమండ, దుళ్ల, వీరవరం గ్రామాల్లోని క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా 557 మంది చేనేత కార్మికుల కుటుంబాలకు రూ.191 లక్షల ప్రయోజనం చేకూర్చారని పేర్కొన్నారు. ఇందులో భాగంగా నేడు 2023–24 సంవత్సరానికి సంబంధించి రెండో విడతగా 170 మంది చేనేత కార్మికులకు లక్షల రూపాయల విలువైన వ్యక్తిగత వర్క్ షెడ్లు, వివిధ రకాల చేనేత ఉపకరణాలను అందజేశామన్నారు. గతేడాది 2022–23లో తొలి విడతగా రూ.53.67 లక్షల విలువైన ఉపకారణాలను అందించామన్నారు. వీటిలో మగ్గం ఉపకరణాలు హెల్డ్, రీడ్, బాబిన్, షటిల్, చరఖా వంటివి ఉన్నాయని వివరించారు. చేనేత కార్మికుల కుటుంబాల సంక్షేమంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉండడం వల్లే ఇదంతా సాధ్యమైందన్నారు.

పేదవాడు ఉన్నతంగా ఎదగాలని..

ఆసరా, చేయూత, వైఎస్సార్ పెన్షన్ కానుక వంటి పథకాలు డీబీటీ ద్వారా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నారన్నారు. పేదవాడు ఎప్పటికీ పేదవాడుగానే ఉండాలనేలా గత ప్రభుత్వాలు వ్యవహరించాయని విమర్శించారు. ప్రతి పేదవాడు ఉన్నతంగా ఎదగాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. అమ్మ ఒడి పథకం కారణంగా ప్రతి తల్లి పిల్లలను స్కూలుకు పంపుతున్నారన్నారు. నేత కార్మికులు ఎదుర్కొనే సమస్యలను సీఎం దృష్టికి తీసుకుని వెళతానని తెలిపారు. చేనేత మగ్గంలో ఉండే దంపతులిద్దరూ రెండేళ్లలో రూ.84 వేలు సంపాదిస్తే, చేయూత, ఆసరా, పెన్షన్ పథకం వర్తింపు తదితర పథకాలు అమలు చేయడం ద్వారా ఏడాదిలోనే ఒకొక్క కుటుంబానికీ లక్ష రూపాయల ప్రయోజనం కలిగించినట్టు వివరించారు. నేడు రూ.25 లక్షల వరకూ ఆరోగ్యశ్రీ పరిమితిని పెంచి కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని పేద ప్రజలకు అందిస్తున్నారని మంత్రి స్పష్టం చేశారు.

వివిధ పథకాల లబ్ధి అందజేత

రాష్ట్ర గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. అనంతరం చేనేత కార్మికులకు వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాన్ని లబ్ధిదారులకు మంత్రి వేణు అందజేశారు. సమావేశంలో చేనేత, జౌళి శాఖ ప్రాంతీయ ఉపసంచాలకుడు ధనుంజయరావు, ఏడీ కె.పెద్దిరాజు, డీఓ రవికుమార్, ఏడీఓ చేతన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు(బాబు), జేగురుపాడు సర్పంచ్, పార్టీ మండల అధ్యక్షుడు యాదల సతీష్ చంద్ర స్టాలిన్, దేవాంగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య, మురమండ చేనేత సొసైటీ అధ్యక్షుడు యర్రా సూర్యనారాయణ, వీరవరం సొసైటీ అధ్యక్షుడు దొంతంశెట్టి చినవీర్రాజు, దుళ్ల సొసైటీ అధ్యక్షుడు వట్టిసూరిబాబు, కడియపులంక సహకార సొసైటీ అధ్యక్షుడు తిరుమలశెట్టి శ్రీనివాస్, మురమండ సర్పంచ్ అయినమిల్లి రుక్మిణి వెంకటేశ్వర్లు, దుళ్ల సర్పంచ్ పట్టియ్య, ఎంపీటీసీ మెల్లిమి గంగ, ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు, పార్టీ నాయకులు ఊటుకూరి శైలజ తదితరులు పాల్గొన్నారు.



రాట్నం తిప్పుతున్న మంత్రి వేణు. చిత్రంలో చందన నాగేశ్వర్

జగనన్నతోనే దివ్యాంగుల సంక్షేమం



ముత్యాల పోసికుమార్

ధవళేశ్వరం: దివ్యాంగుల సంక్షేమం జగనన్నతోనే సాధ్యమని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్ అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. దివ్యాంగులకు హక్కుల చట్టం–2016 అమల్లోకి తీసుకువచ్చి రక్షణ, సహాయం జరిగేలా చూడటం, దివ్యాంగులకు వివాహ ప్రోత్సాహాన్ని రూ.రెండు లక్షలకు పెంచడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దివ్యాంగులపై ఉన్న అభిమానాన్ని తెలియజేస్తోందన్నారు. దివ్యాంగులకు ఉద్యోగాల్లో నాలుగు శాతం రిజర్వేషన్ పెంచడం, సుమారు 1,750 మోటారు సైకిళ్ల పంపిణీ, 80 శాతం దాటిన దివ్యాంగులకు రూ.మూడు వేల నుంచి రూ.ఐదు వేల వరకు పింఛను పెంచడంపై దివ్యాంగుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయన్నారు. దివ్యాంగులను ఎవరైనా అవమానించినా, దూషించినా సెక్షన్ 92ఏ ప్రకారం రెండేళ్ల నుంచి ఐదేళ్ల వరకు జైలు శిక్ష.. దివ్యాంగులకు రక్షణ కల్పించిందన్నారు. దివ్యాంగులకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేయడం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే సాధ్యమైందన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు దివ్యాంగులు సిద్ధంగా ఉన్నారని పోసికుమార్ తెలిపారు.

క్లుప్తంగా

ఉచిత నేత్ర వైద్య శిబిరం



శిబిరంలో నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రాజమహేంద్రవరం రూరల్: పిల్లి లక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శాటిలైట్‌సిటీ గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. నిడదవోలు శ్రీమతి రాజేశ్వరి రామకృష్ణన్ లయన్ కంటి ఆస్పత్రి వైద్యులు సీహెచ్ నాగరాజు, శేఖర్, వారి సిబ్బంది సుమారు 500 మందికి కంటి పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు పిల్లి సతీష్, కార్యదర్శి మామిడిశెట్టి శ్రీనివాస్‌కుమార్, కోశాధికారి పిల్లి శ్రీనివాసరావు, సభ్యులు షేక్ ఖాదర్‌బాషా, మామిడిశెట్టి ఉష, పిల్లి కుమారి.తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు అభినందన



ఎన్‌సీసీ క్యాడెట్లను అభినందిస్తున్న డాక్టర్ రామచంద్రరావు

కంబాలచెరువు: ఆర్ట్స్ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు ఆదివారం తెలిపారు. కళాశాలకు చెందిన ఎన్‌సీసీ మహిళా క్యాడెట్లు ఈ ఏడాది న్యూఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే శిబిరంలో పాల్గొన్నారన్నారు. బీఎస్సీ తృతీయ సంవత్సరం విద్యార్థిని కె.సౌమ్య గార్డ్ ఆఫ్ హానర్‌కు ఎంపికై, శిబిరానికి హాజరైన ఉప రాష్ట్రపతి, ప్రధాని, త్రివిధ దళాల అధిపతులు వంటి వారికి రైఫిల్ సెల్యూట్ చేసే అంశంలో పాల్గొన్నట్టు వివరించారు. అలాగే కళాశాలకు చెందిన మరో విద్యార్థిని సీహెచ్ నిరీష రాష్ట్ర స్థాయి గణతంత్ర దినోత్సవ శిబిరంలో పాల్గొందన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్లను కళాశాల ఎన్‌సీసీ అధికారులు, అధ్యాపకులు అభినందించారు.

ఉన్నత విద్యలో సంస్కరణలపై నేడు సదస్సు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): విద్యా రంగంలో కీలకమైన ఉన్నత విద్యలో సంస్కరణలు అనే అంశంపై స్థానిక తాడితోట జంక్షన్‌లోని సంహిత డిగ్రీ కళాశాలలో ఈ నెల 12న సదస్సు జరగనుంది. దీనికి ఏపీ స్టేట్ కౌన్సిల్ హైయర్ ఎడ్యుకేషన్ (అప్‌చే) వైస్ చైర్మన్ కె.రామ్మోహనరావు హాజరుకానున్నారు. ఉన్నత విద్యలో సంస్కరణలపై ఆయన విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి, పలు అంశాలను విశదీకరించనున్నారు. ఈ సదస్సులో విద్యార్థులందరూ పాల్గొనాలని కళాశాల ప్రిన్సిపాల్ తోట రామకృష్ణ, ఏఓ జి.బాలకృష్ణ, ఎన్ఎస్ఎస్ పీఓలు సీహెచ్ రామకృష్ణ, జి.వెంకటలక్ష్మి కోరారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

కడియం: మండలంలోని మురమండలో ఆదివారం ఇంటింటికీ త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించినట్టు సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక రాజమహేంద్రవరం కమిటీ అధ్యక్షులు శేఖర్‌బాబు తెలిపారు. తమ సభ్యులు పీఎస్ఎన్ మూర్తి, లక్ష్మీనారాయణ, విజయ్, జయరాం, జోష్, రాణి, సంధ్యారాణి, సూర్యకుమారి, వేణుమాధురి తదితరులతో కలిసి ప్రచారం చేశామన్నారు. పూర్వం నిరాకార పరమాత్మకు గుర్తుగా, గర్భగుడి అవసరం లేని నిరాకార పరమాత్మను ఈశ్వరలింగంగా చూపించేవారని ప్రజలకు వివరించామన్నారు. సగుణోపాసన, నిర్గుణోపాసన వ్యత్యాసాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

దళితులను మోసం చేస్తున్నారు

కడియం: రాష్ట్ర ప్రభుత్వం దళితులను మోసం చేస్తోందని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. వేమగిరి వద్ద ఆదివారం రాత్రి దళిత సింహగర్జన పేరిట సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దళితులకు దక్కాల్సిన పథకాలను రద్దు చేశారని, దాడులు పెరిగిపోయాయని విమర్శించారు. ప్రభుత్వ ఓటమే తన లక్ష్యమన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాలకు అన్యాయం జరుగుతోందన్నారు.

సినిమాలు

శ్యామల	: లాల్ సలామ్
సూర్యమినీ	: ఈగల్
సూర్యప్యాలెస్	: తేరా బాతోన్ మేరీ ఐసా
స్వామి	: ఈగల్
శివజ్యోతి	: అంబాజీపేట మ్యారేజ్‌బ్యాండు
అనుశ్రీ	: హనుమాన్
రాజా	: ఈగల్
అశోక	: ఈగల్
ఊర్వశి	: యాత్ర–2
రంభ	: ఈగల్
మేనక	: నా సామిరంగ
అప్సర	: గుంటూరు కారం
కుమారి	: అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు
నామవరం	
విఎస్.మహల్	: ఈగల్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: యాత్ర–2
కడియం	
వెంకటసూర్య	: ఈగల్

అన్ని సౌకర్యాలు కల్పించాలి

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కమిషనర్



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ: ఎన్నికల సంఘం నిర్దేశించిన కనీస ప్రాథమిక సదుపాయాలన్నీ రాజమహేంద్రవరం సిటీ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను కార్పొరేషన్ కమిషనరు కె.దినేష్‌కుమార్ ఆదేశించారు. ఆదివారం నగరంలోని పోలింగ్ కేంద్రాలను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నగర అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని 232 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు విద్యుత్, ర్యాంపులు, నీటి సరఫరా వంటి సదుపాయాలను ఏర్పాటు చేశామన్నారు. ఫర్నిచర్, అవసరమైన చోట్ల పార్టిషన్ పోలింగ్ తేదీకి ముందు రోజు ఏర్పాటు చేస్తారన్నారు. ప్రైవేట్ భవనాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాల్లో కూడా ఆయా సౌకర్యాలు ఏర్పాటు చేస్తారని వివరించారు. నగరంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో వారం రోజుల్లోగా అన్ని పనులు పూర్తి చేస్తామన్నారు. సెక్టార్ అధికారులు ముందుగా తమ పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటింగ్‌కు అంతరాయం కలిగించే వ్యక్తులను గుర్తించి అర్బన్ తహశీల్దార్ దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. అటువంటి వారిని తహశీల్దార్ కస్టడీలోకి తీసుకోవాలని ఆదేశించారు. బూత్ లెవెల్ అధికారులు తమ పోలింగ్ కేంద్రం పరిధిలో సామాజిక కార్యకర్తలు, మేధావులు తదితరులతో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌లను ఏర్పాటు చేసి, తద్వారా ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. అర్హులైన అందరూ ఓటు వేసేలా చూడాలని పేర్కొన్నారు. సెక్టార్ ఆఫీసర్లు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి, నివేదిక అందజేయాలన్నారు. ప్రజలందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఆయన వెంట అర్బన్ తహసీల్దార్ కె.ఆంజనేయులు, ఈఈ ఆర్‌వీఎస్ శేషగిరిరావు, ఎలక్షన్ డీటీ పవన్‌కుమార్, సెక్టార్ అధికారులు, సూపర్‌వైజర్లు, బూత్ లెవెల్ అధికారులు ఉన్నారు.

అద్భుత నగరంగా తీర్చిదిద్దుతా

అభివృద్ధి పనులకు ఎంపీ భరత్ శంకుస్థాపన



శంకుస్థాపన చేసిన ఎంపీ భరత్. చిత్రంలో రౌతు సూర్యప్రకాశరావు

రాజమహేంద్రవరం సిటీ: దేశంలోనే అద్భుత నగరంగా రాజమహేంద్రవరాన్ని తీర్చిదిద్దాలనేది తన సంకల్పమని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. ఆదివారం నగరంలోని నాలుగో డివిజన్‌లో ఉన్న ఉమెన్స్ కాలేజీ రోడ్డు జంక్షన్ నుంచి రాజేంద్రనగర్ మెయిన్ రోడ్డు వరకూ రూ.47.9 లక్షలతో చేపట్టే బీటీ రోడ్డు రెన్యువల్ పనులు, తొమ్మిదో డివిజన్‌లో రామాలయం జంక్షన్ నుంచి నేషనల్ హైవే వరకూ రూ.117 లక్షలతో బీటీ రోడ్డు రెన్యువల్ పనులకు ఎంపీ భరత్‌రామ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో నగరంలోని అన్ని ప్రధాన రహదారులను సీసీ రోడ్లుగా అభివృద్ధి చేస్తానన్నారు. రహదారులు దీర్ఘ కాలం పాటు మన్నాలంటే నాణ్యమైన పనులు చేపట్టాలని, గత ప్రభుత్వాల హయాంలో మొక్కుబడి పనులు చేయడం వల్ల అన్ని రహదారులూ గుంతలమయమై ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సి వస్తోందన్నారు. నగర వాసులకు 24 గంటలూ మంచినీటి సరఫరా, ఉద్యోగ కల్పనే ధ్యేయంగా కృషి చేస్తానని స్పష్టం చేశారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు ఇచ్చేందుకు పరిశ్రమలు, సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్ ఆఫ్ ఇండియా తీసుకొస్తానని హామీ ఇచ్చారు. పర్యాటక రంగం వృద్ధి చెందుతోందని, పర్యాటకుల రాకపోకల వల్ల నగరాభివృద్ధి మరింత సాధ్యమవుతుందన్నారు. నగరాన్ని ది బెస్ట్ సిటీగా తీర్చిదిద్దడమే ఇప్పుడు తన ముందున్న లక్ష్యమన్నారు. ఆయా కార్యక్రమాల్లో రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, మాజీ కార్పొరేటర్ బొంతా శ్రీహరి, బళ్లా శ్రీనివాస్, ఆర్ఎంసీ ఎస్ఈ పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జాకు టీడీపీ నేతల యత్నం

వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ మొహ్మద్ ఆరిఫ్



స్థానికులతో మాట్లాడుతున్న జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఆరిఫ్

కడియం: పొట్టిలంకలో టీడీపీ నాయకులు మసీదు నిర్మాణం పేరుతో భూ కబ్జాకు పాల్పడుతున్నారని వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ మొహ్మద్ ఆరిఫ్ ఆరోపించారు. ఇందుకు అమాయక ముస్లింలను రెచ్చగొట్టి, కోట్ల రూపాయల విలువైన భూమిని కాజేసేందుకు యత్నిస్తున్నారన్నారు. సయోధ్య చేసే ప్రయత్నాలను అడ్డుకుంటూ వివాదాస్పదం చేస్తున్నారన్నారు. భూ కబ్జాను అడ్డుకుని తీరుతామని ఆరిఫ్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఆదివారం ఆయన గ్రామస్తులు, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్లు, సిబ్బందితో కలిసి సంబంధిత స్థలాన్ని పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. పొట్టిలంకలో మసీదు నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారని టీడీపీ, జనసేన నాయకులు ఆరోపించడాన్ని ఆయన ఖండించారు. ఇరువర్గాల మధ్య సామరస్య వాతావరణం నెలకొల్పేందుకు కృషి చేయాల్సింది పోయి, ఇరు వర్గాలను రెచ్చగొట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తప్పుడు ఆరోపణలతో ప్రభుత్వంపై విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు. త్వరలోనే ఇరువర్గాలతో మాట్లాడి సామరస్య వాతావరణం నెలకొనేలా కృషి చేస్తామన్నారు. ఆయన వెంట వక్ఫ్ బోర్డు డైరెక్టర్లు షబ్బర్ బాషా, మొహమ్మద్ జఫరుల్లాఖాన్, పఠాన్ రహీంఖాన్, సయ్యద్ రబ్బానీ, షేక్ ఇబ్రహీం, షేక్ బిజిలానీ, షేక్ అహ్మద్, వక్ఫ్ బోర్డు జిల్లా ఇన్‌స్పెక్టర్ మొహమ్మద్ షఫీ, గ్రామ పెద్దలు కొత్తపల్లి వేంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

నిస్వార్థ సమాజ సేవకుడు నైనాల

సత్కరించిన ఎంపీ భరత్, ప్రముఖులు



కృష్ణారావును సత్కరిస్తున్న ఎంపీ భరత్. చిత్రంలో రౌతు సూర్యప్రకాశరావు తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: పూలే, అంబేడ్కర్ భావజాల వ్యాప్తికి నాలుగు దశాబ్దాలుగా కృషి చేస్తున్న నైనాల కృష్ణారావు నిస్వార్థ సమాజ సేవకు డాక్టరేట్ రావడం అభినందనీయమని ఎంపీ మార్గాని భరత్‌రామ్ కొనియాడారు. ఆదివారం స్థానిక మోరంపూడిలోని ఏపీఎస్ఈబీ కల్యాణ మండపంలో స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమ వ్యవస్థాపకుడు లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు అధ్యక్షతన నైనాల ఆత్మీయ సత్కార సభ జరిగింది. రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావుతో కలిసి ఎంపీ భరత్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పూలే, అంబేడ్కర్ భావజాల వ్యాప్తికి, బహుజనులు విద్య, సామాజిక, రాజకీయ రంగాల్లో రాణించడానికి వారిని ప్రోత్సహించిన నైనాల ఆదర్శప్రాయుడన్నారు. రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ కృష్ణారావు స్ఫూర్తితో అనేకమంది బీసీలు రాజకీయాల్లో రాణిస్తున్నారన్నారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ బీసీ సంక్షేమం, అభివృద్ధి కోసం కృష్ణారావు కృషి చేశారని ప్రశంసించారు. రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పూలే తొలి కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠించడంలో కృష్ణారావు పాత్ర శ్లాఘనీయమన్నారు. కృష్ణారావును గజమాలతో సత్కరించడంతో పాటు, రూ.25 వేలను ఎంపీ భరత్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, రాజమహేంద్రవరం పార్లమెంటరీ కోఆర్డినేటర్ డా.గూడూరి శ్రీనివాస్, బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

కడియం: వేమగిరిలో సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావిపాటి రామచంద్రరావు తెలిపారు. ఉచితంగా నేత్ర పరీక్షలు చేసి, అవసరమైన వారికి కళ్లజోళ్లు అందిస్తామని చెప్పారు.

ఇంటింటికీ గోదావరి జలాలు

- రూ.215 కోట్లతో అమలయ్యే వాటర్ గ్రిడ్ పథకం
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- శంకుస్థాపన చేసిన రాష్ట్ర మంత్రులు తానేటి వనిత, వేణుగోపాలకృష్ణ



వాటర్ గ్రిడ్ పథకానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు

రాజానగరం: గత ఎన్నికల సమయంలో నియోజకవర్గ ప్రజానీకానికి ఇచ్చిన హామీ మేరకు ఇంటింటికీ గోదావరి జలాలను అందించేలా రూ.215 కోట్ల వ్యయంతో వాటర్ గ్రిడ్ పథకాన్ని అమలు చేస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. రాజానగరంలో ఆదివారం నిర్వహించిన 'ఆడపడచుల ఆశీర్వాద సభ'లో పాల్గొన్న రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత, జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఈ పథకానికి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ అవసరం కోసం మాటివ్వడం, ఆ తర్వాత ముఖం చాటేయడం తమకు చేతకానిదన్నారు. తాను ఎమ్మెల్యేనైతే.. తనతో పాటు ముగ్గురు పనిచేస్తామని మాటిచ్చానని, కానీ నేడు తన సతీమణి డాక్టర్ రాజశ్రీతో నలుగురు వ్యక్తులు శ్రమిస్తున్నామని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలంతా మా కుటుంబమేనని, మీ కుటుంబంలో ఒకనిగా ఇదే ఒరవడిని కొనసాగించే విధంగా ఆశీస్సులు కోరుతున్నానన్నారు. రాబోయే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆప్యాయతను పంచే అన్న పాలన

సభకు అధ్యక్షత వహించిన వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో గతంలో చంద్రబాబు హయాంలో జరిగిన పరిపాలనను దుర్యోధన, దుశ్శాసన, దుర్నీతి పాలనగా పేర్కొన్నారు. ప్రస్తుతం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను ఆప్యాయతానురాగాలను పంచే ఓ అన్న పాలనగా అభివర్ణించారు. రాష్ట్రంలో చేపట్టిన సుదీర్ఘ పాదయాత్ర ద్వారా ప్రజల కష్టాలు స్వయంగా తెలుసుకున్న ఆయన అధికారంలోకి వచ్చాక కుల, మత, వర్గాలతో సంబంధం లేకుండా, అర్హత ఉంటే చాలు సంక్షేమ పథకాలను అందిస్తూ అందరి వాడయ్యారన్నారు. మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి, ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీలు వరదు కల్యాణి, పోతుల సునీత మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళా సాధికారతకు, వారి ప్రగతికి నిరంతరం ఆలోచించే ప్రభుత్వానికి మరోసారి మద్దతు పలకాలని ప్రజానీకానికి విజ్ఞప్తి చేశారు. రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్య, వైద్య రంగాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వానికి ప్రజల మద్దతు ఎల్లప్పుడూ ఉండాలన్నారు. రాష్ట్ర మంత్రులు తానేటి వనిత, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, కాకినాడ ఎంపీ వంగా గీతలు పాల్గొన్న ఈ సభలో, నియోజకవర్గంలోని రాజానగరం, సీతానగరం, కోరుకొండ మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్పొరేషన్ల డైరెక్టర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

క్రికెట్ గ్రౌండ్ అభివృద్ధికి చర్యలు

- కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్
- లెజెండ్ కప్ విన్నర్స్ సర్దార్ కింగ్స్



టోర్నీ విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న కమిషనర్

ప్రకాశం నగర్ : నగరంలో క్రికెట్ గ్రౌండ్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్‌కుమార్ వెల్లడించారు. ఆదివారం లాలా చెరువులోని పోలీస్ క్రికెట్ గ్రౌండ్స్‌లో 40 ఏళ్లు నిండిన క్రికెట్ క్రీడాకారుల లెజెండ్ కప్ క్రికెట్ టోర్నమెంట్ సీజన్–3 ఫైనల్, పోటీల ముగింపు కార్యక్రమానికి కమిషనర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన క్రికెట్ గ్రౌండ్‌లో టోర్నమెంట్ నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. రాజమహేంద్రవరంలోనే రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించుకునేలా ఎస్పీ కార్యాలయ ఆవరణలో గ్రౌండ్‌ను అభివృద్ధి చేయడం వల్ల రాజమహేంద్రవరం క్రీడాకారులు టోర్నమెంట్ నిర్వహించే అవకాశం ఏర్పడిందన్నారు. చారిత్రాత్మకమైన రాజమహేంద్రవరం నగరానికి భవిష్యత్తు తరాలకు ఉపయోగపడేలా క్రికెట్ గ్రౌండ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. టోర్నమెంట్ నిర్వాహకులు బాలాజీ మాట్లాడుతూ పోటీల నిర్వహణకు అవకాశం కల్పించిన జిల్లా ఎస్పీకి, కార్పొరేషన్ కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా లెజెండ్–2024 సీజన్–3 క్రికెట్ టోర్నమెంట్ విన్నర్స్ సర్దార్ కింగ్స్, రన్నర్స్ మెట్రో–11 కాకినాడ జట్లకు ట్రోఫీలను కమిషనర్ అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా అమాన్ సింగ్, బెస్ట్ బ్యాట్స్‌మన్‌గా మిథిన్ (సర్దార్ కింగ్స్), బెస్ట్ బౌలర్‌గా హరికృష్ణ, బెస్ట్ సిరీస్ క్రికెటర్‌గా హరికృష్ణ (కాకినాడ) ఎంపికయ్యారు. టోర్నమెంట్ నిర్వాహకులు శ్రీనివాస చౌదరి, కొండవీటి ప్రభాకర్, జేకేలను కమిషనర్ అభినందించారు.

నేటి నుంచి వేంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు

కడియం: దివాన్‌చెరువులోని డీబీవీ రాజు సిటీలో ఉన్న లక్ష్మీపద్మావతి గోదా ఆండాళ్ సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయం వద్ద వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 12వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని వైఖానస ఆగమ పండితుడు ఖండవల్లి రాధాకృష్ణమాచార్యులు తెలిపారు. ఆదివారం దుళ్లలోని మదన గోపాల స్వామి ఆలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. 12న అకల్మష హోమం, 13న పూర్ణాభిషేకం, సాయంత్రం కల్యాణ మహోత్సవం ఉంటాయన్నారు. 14న లక్ష్మీదేవికి పూర్ణాభిషేకం, పద్మపుష్ప హోమం, 15న మహా సుదర్శన హోమం, మహాశాంతి హోమాలు, సాయంత్రం ఉక్త హోమాలు, 16న చక్రస్నానం, మహా పూర్ణాహుతి, రాత్రి ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవ జరుగుతాయని వివరించారు. ప్రతిరోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

ఘంటశాలకు ఘన నివాళులు

కడియం: అమర గాయకుడు ఘంటశాల వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం వేమగిరిలో అభిమాని ప్రత్తిపాటి నల్లరాజు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అమర గాయకుడిగా ఘంటశాల సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు కొత్తూరి బాలనాగేశ్వరరావు, బొర్రా సుబ్బారావు, సాయిరాం ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.